క్లుప్తంగా

విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయం



పెదకాకాని: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు దాతల సహాయ సహకారాలు అభినందనీయమని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి అన్నారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంఘం రూపొందించిన విషయ పరిజ్ఞాన పుస్తకాలను టి.శివరామకృష్ణ ఆర్థిక సహకారంతో శుక్రవారం అందజేశారు. ఈ పుస్తకాలను విద్యార్థులకు గ్రామ ఉప సర్పంచి వి మురళీకృష్ణ, కె మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయిని జి.శాంతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల గౌరవాధ్యక్షులు ఎం.దేవపాల్, తెలుగు ఉపాధ్యాయులు వై.గురవయ్య పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

పొన్నూరు: భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. శుక్రవారం నిడుబ్రోలులోని కచేరీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సభలో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుంచి 17 అర్జీలు స్వీకరించారు. వాటిలో మ్యుటేషన్ 5, ఇన్‌కమ్ 1, ఎఫ్ లైన్ 5, అడంగల్ కరెక్షన్ 3, పాస్‌బుక్ రీప్లేస్‌మెంట్ 1, డిజిటల్ సిగ్నేచర్ 2 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, సర్వేయర్ సత్యనారాయణ, ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను శుభ్రంగా ఉంచాలి



పొన్నూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ఉపాధ్యాయులు, కమిటీలు బాధ్యతలు నిర్వహించాలని ఎంఈఓ కె. శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 89 పాఠశాలలకు 543 లీటర్ల మరుగుదొడ్ల క్లీనర్ లిక్విడ్, శానిటైజర్స్, ఎయిర్ ఫ్రెషనర్ అందజేశారు.

వెనిగండ్లలో తాగునీరు సరఫరా పునరుద్ధరణ

పెదకాకాని: రక్షిత తాగునీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు నాలుగు రోజుల తరువాత గ్రామంలో సరఫరా చేశారు. 'సాక్షి'లో శుక్రవారం వెనిగండ్లలో తాగునీటి ఇక్కట్లు పేరుతో కథనం కూడా వెలువడింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో పగిలిన పైపు లైన్‌కు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేశారు. కొద్దిరోజుల్లో గ్రామంలో పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. అలానే గ్రామంలో మరమ్మతులకు గురైన బోరింగ్ పంపులకు త్వరలోనే ప్రైవేటు ఫిట్టర్ ద్వారా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పొన్నూరు: సాక్షి శ్రీ భావన్నారాయణ స్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పిన్నమనేని గాంధీ శుక్రవారం తెలిపారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం వేదికగా సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమంలో పూర్వ విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో దావులూరి రాజేంద్రప్రసాద్, కలపాల పద్మేశ్వరరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో అభ్యుదయ రైతులకు పురస్కారాల ప్రదానం నేడు

చేబ్రోలు: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌లో జనవరి 4న విజ్ఞాన్ యూనివర్సిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు 'అభ్యుదయ రైతుల పురస్కారాలు-2025' పేరుతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు కాన్వకేషన్ హాల్ లో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ- వ్యవసాయ సంచాలకులు ఎస్.ఢిల్లీ రావు హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వ్యవసాయ రంగంలో విశేషంగా దిగుబడిని సాధిస్తున్న ప్రతిభావంతులైన 250 మంది అభ్యుదయ రైతు దంపతులను ఎంపిక చేసి ''అభ్యుదయ రైతుల పురస్కారాలు-2025'' పేరిట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైస్ చాన్సలర్ నాగభూషణ్ తెలిపారు.

కలుషిత జలం.. జీవితాలతో చెలగాటం

- కుళాయి ద్వారా రంగు మారిన నీటి సరఫరా
- నిర్లక్ష్యాన్ని వీడని అధికార యంత్రాంగం

పొన్నూరు: ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. పట్టణ ప్రజలకు శుద్ధజలం అందిస్తున్నామని మున్సిపల్ అధికారులు పదే పదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండానే నిడుబ్రోలు రక్షిత తాగునీటి పథకం ద్వారా ప్లాంట్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తూ.. పట్టణ ప్రజల జీవితాలలో చెలగాటం ఆడుతున్నారు. రంగుమారి, దుర్వాసన వెదజల్లుతున్న తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా ఆ నీటినే తాగి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుళాయి ద్వారా వచ్చిన రంగు మారిన నీటిని చూపిస్తున్న మహిళలు

తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతుల కోసం లక్షల్లో నిధులు వెచ్చిస్తున్నారు. ఆ నిధులు ఎటు వెళుతున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిడుబ్రోలు రక్షిత తాగునీటి పథకం ద్వారా సరఫరా అయ్యే నీటిని పట్టణ పరిధిలోని సుమారు 15 వేలకు పైగా కుళాయిల ద్వారా ప్రజలు నీటిని వినియోగిస్తున్నారు. ఎనిమిదో వార్డులోని క్యాబిన్‌పేటలో తాగునీరు కలుషితమైనా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సమస్య ఎల్లప్పుడూ వస్తున్నా శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కలుషిత జలం నుంచి కాపాడాలని కోరుతున్నారు.



రంగు మారిన నీరు

కుళాయిల ద్వారా రంగు మారిన నీరు

నిడుబ్రోలు పరిధిలోని క్యాబిన్‌పేటలో శుక్రవారం శుద్ధి చేయని తాగునీరు సరఫరా అయింది. మురుగు రంగులో, దుర్వాసన వస్తుంది. ఆ నీరు తాగి రోగాల బారిన పడుతున్నాం. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ కొరవడటంతోనే ఈ సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శుద్ధమైన తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నా.

– ఎం.చిలక, షేక్ రసూల్‌బి, క్యాబిన్‌పేట, నిడుబ్రోలు

వెంటనే సమస్యను పరిష్కరిస్తాం



రక్షిత తాగునీటి పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీటి నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. క్యాబిన్ పేటలో ఏర్పడిన సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు స్వచ్ఛమైన నీరందించే విధంగా చర్యలు చేపడతాం.

–వెంకయ్య, మున్సిపల్ డీఈ, పొన్నూరు

అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: విలీన గ్రామాల్లోని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ అంకిరెడ్డిపాలెంలో హిందూ శ్మశాన వాటిక వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అంకిరెడ్డిపాలెం హిందూ శ్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి, వాకింగ్ ట్రాక్‌లో మరుగుదొడ్లు లేవని వాకర్స్ ఫిర్యాదు మేరకు బాస్కెట్ బాల్ కోర్ట్ దగ్గర ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావడానికి బోర్ వెల్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి వెంకటేశ్వరరావు, డీఈఈలు మధుసూదనరావు, సతీష్ కుమార్, శ్రీనివాసరావు, ఆర్.ఓ. రెహ్మాన్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపాలెం హిందూ శ్మశాన వాటిక వద్ద అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తి రావు మాట్లాడుతూ 'భారతదేశంలో మహిళల విద్య, సాధికారత పెంపునకు మహాత్మా జ్యోతిరావు పూలే - సావిత్రీబాయి పూలే సహకారం' అనే అంశంపై జనవరి 30- 31 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పూలే అధ్యయన కేంద్రాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య వై.అశోక్ కుమార్, ఆచార్య కె.ధనలక్ష్మి, పూలే సెంటర్ ప్రోగ్రామర్ బి.కోటి యాదవ్ పాల్గొన్నారు.



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ రత్నషీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

పంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

మెయిన్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన చేబ్రోలు పంచాయతీ కార్మికులు

చేబ్రోలు: అక్రమంగా తొలగించిన చేబ్రోలు పంచాయతీ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. జనవరి ఒకటో తేదీన తొలగించిన 12 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జరుగుతున్న పోరాటం శుక్రవారానికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే చట్టాలను ఉల్లంఘించి అక్రమంగా తొలగించడం బాధాకరమన్నారు. ఎటువంటి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్న కార్మికులను ఇష్టానుసారంగా తొలగించడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికుల్ని తొలగించాలనే ఆలోచన చేయడం దారుణమని పేర్కొన్నారు. కార్మికులకు చట్టాలు ఉంటాయని వాటిని అధికారులు గౌరవించాలన్నారు. పవన్ కళ్యాణ్ మంత్రిగా ఉన్న శాఖలోనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీను మాట్లాడుతూ సమస్య పరిష్కరించాల్సిన అధికారులు, పోలీసులను ఆశ్రయించడం వెనక ఉద్దేశాన్ని ప్రశ్నించారు. కార్మిక చట్టాలపై ఏ మాత్రం గౌరవం ఉన్నా తక్షణమే అక్రమంగా తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేబ్రోలు సెంటర్ నుండి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ఎంపీడీఓ కె.లలితకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్ హనుమంతరావు, రమేష్ బాబు, ఆదిశేషు, దివ్యశ్రీ, నాగేశ్వరమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఐకాన్ సింబల్‌గా పీవీకే నాయుడు మార్కెట్

కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి

నెహ్రూనగర్: గుంటూరు నగరానికి ఐకాన్ సింబల్‌గా పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణం చేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణంపై మార్కెట్ వ్యాపారుల సంఘ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పీవీకే నాయుడు మార్కెట్ సుమారు రూ.152 కోట్లతో 8 అంతస్తులుగా నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినట్లు చెప్పారు. అతి త్వరలో పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మార్కెట్ నూతన భవనంలో గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో సుమారు 307 మందికి స్టాల్స్ కేటాయించవచ్చని, వ్యాపారస్తుల సంఘ ప్రతినిధుల వినతి మేరకు ప్రస్తుతం ఉన్న 374 మందికి స్టాల్స్ కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. నగరపాలక సంస్థ అధికారులు, వ్యాపారస్తుల సంఘ ప్రతినిధులతో మార్కెట్ నిర్మాణ పనుల పర్యవేక్షణకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారస్తులు ఏ విధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిర్మాణ సమయంలో వారు వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా ప్రత్యామ్నాయ స్థల సేకరణ చేస్తున్నామని హామీ ఇచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యంగా, గుంటూరు నగరానికి మణిహారంగా పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరికీ నూతన భవనంలో పారదర్శకంగా షాపు కేటాయింపు ఉంటుందని హామీ ఇచ్చారు. పనులు ప్రారంభించిన రెండేళ్లలో పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈలు సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి

కార్మికుల జీతాలు వెంటనే పెంచాలి

నెహ్రూనగర్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం వెంటనే జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ సంస్థ) ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలైన కార్మికుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్య వహించడాన్ని ఖండించారు. కార్మికులకు ఇచ్చిన హామీలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం పెంపు జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ఉమామహేశ్వరరావు

జమిలి ఎన్నికలు సమైక్య స్ఫూర్తికి విరుద్ధం

లక్ష్మీపురం: జమిలి ఎన్నికలు సమైక్య స్ఫూర్తి విరుద్ధమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల విశ్లేషణ సభ శుక్రవారం నిర్వహించారు. జాతీయ స్థాయిలో జరిగిన 2024 సాధారణ ఎన్నికలు భారత దేశంలో సంకీర్ణ రాజకీయాల అవసరాన్ని తెలిపాయని, ఈ ఫలితాలు అర్థం చేసుకుని నరేంద్ర మోదీ ప్రభుత్వం పరిపాలన చేయాలన్నారు. ఆర్థిక సంఘం ద్వారా నిధులు కేటాయింపులో లోక్ సభ సీట్ల పెంపుదలలో జనాభా ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల దక్షిణాది రాష్ట్రంలో నష్ట పోతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో విశ్లేషకులు మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, వి.పాములరెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, గూడవల్ల నాగేశ్వరావు ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మహనీయురాలు సావిత్రీబాయి పూలే

పెదకాకాని: మహిళల అభ్యున్నతి కోసం పోరాడిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయాధికారి వేముల విజయకుమార్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి, జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. తొలుత సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయిని హేమలతను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ ఎల్ఈ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కొల్లిపర ఆనందరావు, యలమంద, పిల్లి వెంకటరాజు పాల్గొన్నారు.

బహుజన మహిళల స్ఫూర్తి..

గుంటూరు రూరల్: మహిళలకు స్ఫూర్తి సావిత్రీబాయి పూలే అని ప్రగతి నారీశక్తి జాతీయ అధ్యక్షురాలు పొట్లూరి దేవి పేర్కొన్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులోని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఎనిమిది రాష్ట్రాలలో ప్రగతి నారీశక్తి ఆధ్వర్యంలో లక్షలాది మంది మహిళల సాధికారత కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామన్నారు. మహిళల ట్రాఫికింగ్ వ్యతిరేక కార్యక్రమాల ద్వారా పోలీసుల సహకారంతో వేలాది మందిని కాపాడగలిగామని చెప్పారు. మహిళల ఆరోగ్యం, న్యాయ సంబంధ సమస్యలు, విద్యావంతులైన యువతులకు ప్రత్యేక శిక్షణల ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపటంతో పాటు స్వయం సహాయ గ్రూపులు ఏర్పాటు చేసి వారి కాళ్లపై వారు నిలబడేలా కృషి చేశామన్నారు. సభకు అధ్యక్షత వహించిన సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఏ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ సావిత్రిబాయ్ పూలే స్ఫూర్తితో గత రెండు దశాబ్దాలుగా ప్రగతి నారీ శక్తి సంస్థ ఏర్పాటు చేసి లక్షలాదిమంది మహిళల సమగ్ర సాధికారిత కోసం పొట్లూరి దేవి చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని తెలియజేశారు. కార్యక్రమంలో మానవత పరిరక్షణ సమితి అధ్యక్షురాలు శ్రీనీలత, ఆర్.రాజకుమారి, షేక్ ముంతాజ్ సుమతి, ఎస్.విజయలక్ష్మి, న్యాయవాది షేక్ రహీమాన్, జె.వెంకటరత్నం, శరత్, అనంతరామయ్య పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

పొన్నూరు: ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా నాయకురాలు అంగలకుదురు దుర్గాభవాని, మహిళా సమాఖ్య కార్యకర్తలు దేవరకొండ తిరుపతమ్మ,సుజాత, సుగుణ, లక్ష్మి, సంధ్య, వెంకటేశ్వరమ్మ, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి అరేటి రామారావు పాల్గొన్నారు.

పెదనందిపాడులో..

కాకుమాను: మహిళల హక్కుల సాధన కోసం పోరాడిన ధీర మహిళ సావిత్రీబాయి పూలే అని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కిరణ్ జోష్ అన్నారు. పెదనందిపాడు లయన్స్ మాంటిస్సోరీ (సీబీఎస్)పాఠశాలలో శుక్రవారం పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయినిలను ఘనంగా సన్మానించారు.



పెదకాకాని గ్రంథాలయంలో పూలే చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



బీసీ సమన్వయకమిటీ కార్యాలయంలో దేవిని సన్మానిస్తున్న నాయకులు



సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పించిన సమాఖ్య సభ్యులు



పెదనందిపాడులో పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

13 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 13, 14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు.బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై ప్రత్యేక శుక్రవారం సమావేశం నిర్వహించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరయ్యారు. ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నామని చెప్పారు. సంబరాల నిర్వహణకు అధికారులు, నగర ప్రముఖులతో నిర్వహణ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. సంబరాల్లో నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్టయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, కార్పొరేటర్లు మానం పద్మశ్రీ, ఈరంటి వరప్రసాద్ పాల్గొన్నారు.

చేతివృత్తి దారులకు నైపుణ్య శిక్షణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రకాలైన చేతి వృత్తిదారుల(సర్వీసు ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేజ్-1)ను గుర్తించి వారికి నైపుణ్య, సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటివి మరమ్మతులు చేసేవారు, పెయింటర్, బ్యూటీషియన్(స్త్రీ, పురుషులు) తదితరులకు తగిన నైపుణ్య, సాంకేతిక శిక్షణ, సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు జీవనోపాధి కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం నుంచి 7 వ తేదీ లోగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మెప్మా విభాగం(యూనియన్ బ్యాంకు, జీఎంసీ ఎక్స్‌టెన్షన్ ఎదురు)లో తమ పేర్లు, వివరాలతో పాటు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు కాపీ, విద్యార్హత, అనుభవ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్ బుక్, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటోలు రెండు తదితర వివరాలతో నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సిటి మిషన్ మేనేజర్స్, మెప్మా, వి. మాధవరావు(77807 65984), ఎస్.వి.శివ నాగేశ్వరి(83098 14869), డి.పావని (83098 15289) తదితరు లను సంప్రదించాలని సూచించారు.

7న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

లక్ష్మీపురం: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 7న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 19న ఆటో కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆటో కార్మికుల గుంటూరు జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు వుప్పాల సత్యనారాయణ, కోట మాల్యాద్రి, రావుల ఆంజిబాబు, బందెల రవికుమార్, చిన్ని సత్యనారాయణ, ఆరేటి రామారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, పారిశుద్ధ్య పనులను పిన్ పాయింట్‌గా పర్యవేక్షణ చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రెటరీలతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా వార్డు సచివాలయాల ప్రాతిపదికన 802 మైక్రో ప్యాకెట్స్‌ని రూపొందించామన్నారు. ప్రతి కార్యదర్శి తమ పరిధిలోని కార్మికులకు ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసి, హాజరు, సెలవులు నమోదు చేయాలన్నారు. త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ప్రతి సచివాలయం పరిధిలో జరిగే పారిశుద్ధ్య పనులను క్షుణ్ణంగా పర్యవేక్షణ చేస్తామన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ పీజే అమృతం, ఎంహెచ్ఓ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, వీపీఎస్ వెంకటేశ్వర్లు, ఏఎంహెచ్ఓలు ఆనందకుమార్, రాంబాబు, శానిటరీ సూపర్వైజర్లు ఆయూబ్ ఖాన్, సోమశేఖర్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు పాల్గొన్నారు.